క్లుప్తంగా

అందుబాటులో వరి, కంది విత్తనాలు

గరికపాడు(జగ్గయ్యపేట): గ్రామంలోని కేవీకేలో బీపీటీ-5204 వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేవీకే పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త కృష్ణంరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 కేజీల బస్తా రూ.1175కు అందిస్తున్నామన్నారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డుతో కార్యాలయ పని వేళల్లో పొందాలని చెప్పారు. అదే విధంగా కందులు ఎల్ఆర్జీ-52 అమరావతి రకం విత్తనాలు సైతం అందుబాటులో ఉన్నాయని కిలో రూ.140కు ఇస్తున్నామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి

జగ్గయ్యపేట: మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కార్యాలయ మేనేజర్‌గా పని చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి మంగళవారం ఆదేశాలు వచ్చాయి. ఇప్పటి వరకు కమిషనర్‌గా పని చేసిన రామ్మోహన్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన స్థానంలో విష్ణువర్ధన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. త్వరలో నూతన కమిషనర్‌ను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

రేపు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామంలో నూతనంగా నిర్మించిన గోదా పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహ, ధ్వజస్తంభ శిఖర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు నెమలిపురి ప్రసాదరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 7.26 గంటలకు వేద పండితుడు ధనకుధరం సీతారామానుజాచార్య స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ జరుగుతుందన్నారు. మహోత్సవాల్లో భాగంగా దేవతామూర్తుల విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నెమలిపురి వాసు, ప్రసాద్, చంద్ర సురేష్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం జగ్గయ్యపేట మండలానికి చెందిన రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అందజేశారు. జీలుగ క్వింటా రూ.6,150, పిల్లి పెసర క్వింటా రూ.9 వేలకు ఇస్తున్నారని ఎమ్మెల్యే తాతయ్య తెలిపారు. అదే విధంగా ప్రకృతి వ్యవసాయం వారు పీఎండీఎస్ కిట్‌లను రైతులకు సరఫరా చేశారు. రైతులు పచ్చిరొట్ట పైరులు వేసి 50 శాతం పూత దశలో నేలలో కలియదున్నడం వలన నేల సారం పెరిగి, భూమిలో నత్రజని శాతం పెరుగుతుందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ రామకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, నాయకులు మైనేని రాధా, యానాల గోపి, కానూరి కిశోర్, తోట నాగమల్లేశ్వరరావు, ఏడీఏ భవాని, ఏవో వరలక్ష్మి, ఏఈవోలు, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సర్టిఫికెట్ల అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో మే నెల 1వ తేదీ నుంచి కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో కోచ్ రాజేంద్ర నిర్వహించిన సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపు జూన్ 1వ తేదీ నాటికి ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులకు మంగళవారం ఎమ్మెల్యే తాతయ్య సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కోచ్ రాజేంద్ర, నోముల రఘు, బీవీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల లక్ష్యం నెరవేరేనా..?



శనగపాడులో నిర్మిస్తున్న ఇంకుడు గుంత



ఇంకుడు గుంత నిర్మాణానికి తీసుకువచ్చిన సామగ్రి

- అవగాహన కల్పించని అధికారులు
- ఆసక్తి చూపని ప్రజలు

పెనుగంచిప్రోలు: ఉపాధి హామీ పథకానికి అనుసంధానంగా చేపట్టిన ఇంకుడు గుంతల తవ్వకం పనులు లక్ష్యం దిశగా జరగటం లేదు. భూగర్భ జలాలు ఇంకిపోకుండా ఉండేందుకు ఇళ్లల్లో వాడుకున్న నీటితో పాటు వర్షపు నీరు భూమిలోకి ఇంకేలా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత తవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరటం లేదు. ఈ గుంతలు తవ్వకం లక్ష్యం సగానికి కూడా అమలు కాలేదనే ఆరోపణలు ఉన్నాయి.

గుంత తీసుకునేందుకు రూ.6 వేలు..

జాబు కార్డు కలిగి ఉన్న ఉపాధి హామీ కూలీలు వ్యక్తిగతంగా గుంతలు తవ్వుకంటే వారికి రూ.6 వేలు ఇస్తారు. గుంత 3 అడుగులు వెడల్పు, 4 అడుగులు లోతు ఉండాలని ఉపాధిహామీ పథకం అధికారులు అంటున్నారు. అయితే లక్ష్యం దిశగా గుంతలు తీసే కార్యక్రమం జరగటం లేదు.

నియోజకవర్గంలో..

పెనుగంచిప్రోలు మండలానికి 30 ఇంకుడు గుంతలు మంజూరు కాగా 18 పూర్తయ్యాయి. 12 పూర్తి చేయాల్సి ఉంది. వత్సవాయి మండలంలో 54 గుంతలు మంజూరు కాగా 54, జగ్గయ్యపేట మండలంలో 200 గుంతలు మంజూరు కాగా 150 పూర్తయ్యాయి. అయితే క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించక పోవటం వలనే గుంతల నిర్మాణాలకు ప్రజలు ఆసక్తి చూపటం లేదని అంటున్నారు. ప్రతి మండలంలో 1000 వరకు గుంతలు తవ్వాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి, వర్షాలు పడేలోగా వీటిని పూర్తి చేయాలని అధికారులకు నిర్దేశించారు. కానీ వర్షాలు మొదలైనా పూర్తి స్థాయిలో ఇంకుడు గుంతలు నిర్మాణాలు జరగలేదు. దీనిపై ఉపాధిహామీ పథకం అధికారులను వివరణ కోరగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు చేపడుతున్నామన్నారు.

నేటి 'వెన్నుపోటు దినం' విజయవంతానికి పిలుపు



జగన్‌మోహనరావు, మాజీ ఎమ్మెల్యే



తన్నీరు నాగేశ్వరరావు

నందిగామరూరల్: కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేస్తున్న అరాచకాలు, మోసాలు, అన్యాయాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 8.30 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ అసమర్థతపై ప్రజా వ్యతిరేకత

జగ్గయ్యపేటఅర్బన్: కూటమి ప్రభుత్వ విధానాలను ఎండగట్టే విధంగా వైఎస్సార్ సీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 10 గంటలకు కోదాడ రోడ్‌లోని పార్టీ కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ బయలుదేరుతుందన్నారు. పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, రైతుబజారు, నెహ్రూచౌక్, బలుసుపాడు సెంటర్, అప్సరా థియేటర్ రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ జరుగుతుందని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ, ఎన్టీఆర్ జిల్లా పార్టీ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి విచ్చేస్తారన్నారు. మోదుగుల వేణుగోపాలరెడ్డి నేతృత్వంలో జరుగు ఈ నిరసన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ అసమర్థతపై ప్రజా వ్యతిరేకతను తెలియజేయాలని కోరారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి



హెల్మెట్ వినియోగంపై అవగాహన కలిగిస్తున్న సీఐ వైవీఎల్ నాయుడు

నందిగామరూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించటం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని అంబారుపేట సమీపంలోని వై.జంక్షన్ వద్ద హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహనదారులకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం మంది తలకు గాయాలై ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరించటం వల్ల అటువంటి ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. యువత వేగానికి ఇచ్చే విలువ ప్రాణానికి ఇవ్వకపోవటం బాధాకరమన్నారు. ముఖ్యంగా మద్యం తాగి, త్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ పూర్ణిమ, ట్రాఫిక్ ఎస్ఐ నరేష్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా షిర్డీ సాయి మందిర వార్షిక వేడుకలు



పూజల్లో పాల్గొన్న దంపతులు

నందిగామరూరల్: పట్టణంలోని చెరువు బజారులో వేం చేసి ఉన్న షిర్డీ సాయిబాబా మందిర 24వ వార్షిక వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం ఆలయ అర్చకుడు దెందులూరి కృష్ణశాస్త్రి బాబా వారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. సుప్రభాత సేవ, కాగడ హారతి, గణపతి పూజ, అఖండ ప్రతిష్ఠాపన, మండపారాధనతో పాటు బాబా వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ గణపతి నవగ్రహ చండీ సహిత రుద్ర హోమాది క్రతువులను పలువురు దంపతులు పీటలపై కూర్చొని వేదోక్తంగా జరిపించారు. రాత్రికి పల్లకి సేవతో పాటు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామి వారి ఊరేగింపును కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తమ్మినేని మల్లికార్జునరావు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సమ్మర్ చెస్ టోర్నమెంట్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని కాకతీయ సేవాసమితి కార్యాలయం భవనంపైన విశ్వకర్మ ట్యుటోరియల్స్‌లో మంగళవారం సమ్మర్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వారికి కాకతీయ సేవాసమితి అధ్యక్షుడు ఇంటూరి రంగారావు, మహిళా అధ్యక్షురాలు ముప్వ శ్రీదేవి, కార్యదర్శి సూరపనేని సుబ్బారావు, మహిళా కార్యదర్శి మండవాపు రమాదేవి ముఖ్య అతిథులుగా పాల్గొని బహుమతులను అందజేశారు. శ్రీదేవి మాట్లాడుతూ.. చెస్, అబాకస్ వంటివి విద్యార్థుల మేధాశక్తిని పెంచుతాయని, సహనాన్ని, శ్రద్ధను అలవర్చుతాయని తెలిపారు. చెస్ క్లాసులు సంవత్సరమంతా నిర్వహిస్తామని, జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల్లో ఉన్న విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాలను వెలుగులోకి తీసుకొని రావడమే విశ్వకర్మ ట్యుటోరియల్స్ లక్ష్యమని ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఆలూరు రాజ్యలక్ష్మి అన్నారు. ఉపాధ్యాయులు సౌభాగ్యం, జ్యోతి, కోచ్ మహేష్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలుగా తేజస్విని, హర్షమిత్ర, గణపతి, అయాన్, నాగపరిమళ కుమార్, సాత్విక్, విష్ణుకౌశిక్, లక్ష్మణ్, గౌతమ్, రిత్విక్, ఆనంద్, చైతన్య, ముషాహిదా, వర్ణిక, కారుణ్య, తేజస్య, మోహన, తోష్విత, త్రిపురేశ్వరి, ప్రిస్కిల్లా నిలిచారు.

పాలకేంద్రం డైరెక్టర్ ఎన్నికలో రసాభాస

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): స్థానిక పాల ఉత్పత్తిదారుల సంఘం డైరెక్టర్ ఎన్నిక సందర్భంగా రసాభాస చోటుచేసుకుంది. మంగళవారం సంఘం వద్ద సర్వసభ్య సమావేశం సందర్భంగా ఇద్దరు డైరక్టర్ల ఎన్నిక నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా అధికార పార్టీ నాయకులు కొందరు అక్కడకు వచ్చి మినిట్స్ బుక్ చించి ఎత్తుకెళ్లారు. దీనిపై సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి రామనాథం, కార్యదర్శి రామకృష్ణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటనపై కార్యదర్శి మాట్లాడుతూ.. 95 చట్ట ప్రకారం సంఘంలో 10 మంది డైరెక్టర్లలో ప్రతి ఏడాది ఇద్దరికి అవకాశం కల్పిస్తారన్నారు. ఎన్నికలో పాల్గొనాలంటే 180 రోజులు 180 లీటర్లు పాలు పోసిన వారై ఉండాలని చెప్పారు. దీనికి సంబంధించి 60 మంది సభ్యులు ఎన్నికలో పాల్గొనే అవకాశం పొందారన్నారు. ఎన్నికకు 15 రోజుల ముందుగానే సంఘ కార్యాలయంలో నోటీస్ బోర్డులో సభ్యుల పేర్లు ఉంచుతామన్నారు. మెజార్టీ ఉన్నవారు డైరెక్టర్లను ఎన్నుకుంటామని చెప్పారు. ప్రస్తుతానికి ఎన్నిక వాయిదా పడింది.

పాము కాటుకు గురైన రైతు

నందిగామటౌన్(చందర్లపాడు): మండలంలోని కాసరబాద గ్రామానికి చెందిన రైతు పాము కాటుకు గురయ్యాడు. సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన రైతు వాసిరెడ్డి సాంబశివరావు రోజూ మాదిరిగా మంగళవారం తన పొలంలో పనులకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు ఆయనకు చికిత్సనందిస్తున్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మోసపూరిత హామీలతో చంద్రబాబు గద్దెనెక్కారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ బూడిద నరసింహారావు పేర్కొన్నారు. వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని కోరుతూ గ్రామంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చి ఏడాదైనా పథకాలను అమలు చేయడం లేదన్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి పాల్గొంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి శివరాత్రి పృథ్వీ, జిల్లా కార్యదర్శులు చల్లా వైకుంఠరావు, మాతంగి బాబు, వేముల మల్లేశ్వరరావు, గ్రామ కన్వీనర్ దొంగల రాంబాబు, నాయకులు బండి రాజు, గూడపాటి శేషయ్య, గడ్డం రామకృష్ణ, అన్నాబత్తుల శ్రీనివాసరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి



పరిటాలలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కంచికచర్ల: మండల పరిధిలోని పరిటాలలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ ఫ్రీ- ఖరీఫ్ కాలం కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గరికపాడు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ లక్ష్మీకళ, డాక్టర్ టి.జస్వంతరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయం సాగుచేసే ముందుగా భూ సార పరీక్షలు చేయించుకోని, ఆ భూమికి అనుకూలమైన పంటలు సాగుచేయాలన్నారు. వేసవిలో దుక్కులు వేసుకోవాలని, పంట సాగుచేసే ముందుగా పచ్చి రొట్టి సాగుచేయాలని సూచించారు.

మిద్దె తోటల పెంపకంపై అవగాహన..

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రీయ ఎరువులను ఉపయోగించాలన్నారు. అనంతరం నూతన వంగడాలు, వ్యవసాయ ఆధునీకత, కలుపు మొక్కల నివారణ, మిద్దె తోటల పెంపకం, పచ్చి రొట్టె ఎరువుల ప్రాముఖ్యత, పురుగు మందుల అవశేషాలు, కోత అనంతరం మొక్కజొన్నలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయి పథకాలు, జాతీయ చీడపీడల నివారణ వ్యవస్థను, గేదెల్లో లింగ నిర్ధారణ ఎద, ఇంజెక్షన్, పిండి మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌వీఎస్ గోపాలస్వామి, ఎస్.కృష్ణరాజు, నందిగామ ఏడీఏ ఐకే శ్రీనివాస్, డీఆర్‌సీ ఏడీఏ మోనిషా, ఏఓ కె.విజయకుమార్, ఉద్యానవన శాఖ అధికారి నీలిమ, వెటర్నరీ ఏడీ వెంకట్రావు, ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి కేవీ చౌదరి, డాక్టర్ పి.ప్రేమ రంజన్, పరిటాల, కీసర, గొట్టుముక్కల, కొత్తపేట, పెండ్యాల, చెవిటికల్లు తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



కొణకంచిలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



కంచికచర్లలో యోగాసనాలు చేస్తున్న చిన్నారులు



పేటలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. మంగళవారం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించటంతో పాటు పాటలు పాడించి, క్యారమ్స్, చెస్ వంటి ఆటలు ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలు

కంచికచర్ల: గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం వేసవి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఆంగ్లభాష నేర్పించారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మెదడుకు పదును పెట్టేందుకు గ్రంథాలయాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పుస్తకాలు చదవటం, దేశ నాయకుల చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు యోగాసనాలు నేర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్-1 శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ముందుగా విద్యార్థులతో కథల పుస్తకాల పఠనం చేయించి వారితో కథలను చెప్పించారు. అనంతరం విద్యార్థులకు స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రాము, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలి



కంచికచర్ల సమావేశంలో పాల్గొన్న కమల, ఆశా వర్కర్లు

కంచికచర్ల: ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.కమల ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కంచికచర్ల, పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ.. ఆశా వర్కర్లను రెగ్యులైజ్ చేయాలని, నెలకు రూ.26 వేల వరకు వేతనం ఇవ్వడంతో పాటు చట్టబద్ధమైన సౌకర్యాలు, వసతులు కల్పించాలన్నారు. ఒప్పంద జీఓలను అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కంచికచర్ల, పెండ్యాల పీహెచ్‌సీ పరిధిలో పనిచేసే ఆశావర్కర్ల కమిటీని ఏకగ్రీవంగా నియమించారు.

కంచికచర్ల పీహెచ్‌సీ పరిధిలో..

కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అధ్యక్ష కార్యదర్శులుగా కె.గోవిందమ్మ, సీహెచ్ కరుణ, కోశాధికారి జె.మల్లేశ్వరి, జాయింట్ సెక్రటరీ వి.గాయత్రి, వైస్ ప్రెసిడెంట్ డి.శైలజ, ఎం.పద్మ, సీహెచ్ మరియమ్మ, ఎస్.భువనేశ్వరిలను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పెండ్యాల పీహెచ్‌సీ పరిధిలో..

మండలంలోని పెండ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అధ్యక్షురాలు పి.రోజ్‌మేరీ, కార్యదర్శి పి.నాగమణి, కోశాధికారి ఎం.జవలేశ్వరి, కమిటీ సభ్యులుగా బి.కృపామణి, ఎస్‌కే శిరీస్ మున్నీర్‌లను ఎన్నుకున్నామని కమల చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, మండల అధ్యక్షురాలు పి.పుల్లమ్మ ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం మరిచారు!



పాఠశాలలో కూలిన ప్రహరీ (ఫైల్)

ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): గతేడాది సెప్టెంబర్ నెలలో కురిసిన వర్షాలకు వాగులు పొంగాయి. మండలంలో మునేరు వరదకు తోడు పంట కాలువలు తెగాయి. వరదలకు మండలంలోని ముచ్చింతాల పాఠశాల బాగా దెబ్బతింది. వరద పాఠశాలపై నుంచి ప్రవహించింది. పాఠశాల మొత్తం మట్టి మేట వేసింది. తరగతి గదుల్లో ఐదు అడుగుల మేర వరద నీరు ప్రవహించింది. వరద బీభత్సానికి పాఠశాలకు తూర్పు, దక్షిణం వైపు ప్రహరీ పడిపోయాయి. పాఠశాల హెచ్ఎం గదిలోని రికార్డులు మొత్తం తడిసి ముద్దయ్యాయి. రెండు ఐఎఫ్‌పీ ప్యానెల్స్, స్మార్ట్ టీవీ, టాయిలెట్ బ్లాక్‌లో ఇసుక మేట వేయటంతో పాటు డోర్స్ పూర్తిగా దెబ్బతిన్నాయి. గోడలు కూలిపోవటంతో పాఠశాల పరిసరాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. మరో 10 రోజుల్లో పాఠశాలలు తెరుస్తున్నా నేటి వరకు ప్రహరీ నిర్మాణం పట్టించుకోకపోవటం దారుణమని, తక్షణం ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలికలందరూ ఉన్నత విద్యనభ్యసించాలి



పెనుగంచిప్రోలు: బాలికలందరూ ఉన్నత విద్యనభ్యసించాలని చిల్లకల్లు ప్రాజెక్టు ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి అన్నారు. స్థానిక రామాలయం కల్యాణ మండపంలో మంగవారం కిశోర వికాసం శిక్షణ తరగతుల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డి.శ్రీలక్ష్మి అధ్యక్షతన సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య వలన మహిళా సాధికారత సాధ్యమవుతుందన్నారు. విద్యే మూడో నేత్రమని చెప్పారు. సర్పంచ్ వేల్పుల పద్మకుమారి మాట్లాడుతూ.. కిశోర బాలికలు నాయకత్వ లక్షణాలు కలిగి ఉండి, ఉన్నతి సాధించాలన్నారు. డైరెక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. కిశోర బాలికల్లో నాయకత్వం, సాధికారికతను వివరించారు. బాల్య వివాహాలు చేయటం నేరమని, బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 సంవత్సరాల వయస్సు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. ప్రతి ఒక్కరు యోగా సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు మండల సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, వెలుగు సీసీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.